# నందనవనం - 16

''బావుంది... అది నేనెలా నిర్ణయిస్తానూ...? మనలాంటి పెద్దలకు మాత్రం చూసిరావటం వరకూ బాగానే ఉంటుంది...! ఇక పిల్లల సంగతంటావా... వాళ్ళ భవిష్యత్తు ఆలోచనలు వాళ్ళకీ ఉంటాయి...! ఎక్కడ ఏ మంచి కనిపించినా, అలవరచుకోగలగాలి! మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎవరమైనా మారాల్సిందేగా!'' అంటూ పున్నమ్మ లేచి నిలబడింది.

''ఉండు పిన్నీ... మరి కాసేపు కబుర్లు చెప్పుకుందాం... నీ మాటలు విని ఎన్నాళ్ళయిందో'' అందొక ఆమె.

''అన్నీ ఒక్కసారే గడగడ పాఠం అప్పచెప్పినట్లుగా ఎలా చెప్పగలనే అమ్మాయ్... అపుడపుడూ కుదిరినపుడల్లా కూర్చుని చెప్పుకోవచ్చులే... కబుర్లదేం భాగ్యం... అలా ఊట ఊరుతూనే ఉంటుంది! ఇన్నాళ్ళయినా ఇటువేపు రాకపోతినే అని... అందర్నీ ఇక్కడే  చూడొచ్చుకదానీ వీలు చేసుకుని వచ్చాను! పెద్ద మనవడికి కొంచెం ఒళ్ళు వెచ్చబడింది... కొంచెం సేపు వాడి దగ్గర కూర్చోవాలి... అందుకే తొందర పడుతున్నాను. వచ్చినందుకు... ఎపుడో విన్న అరుగుల బడి ఆవరణలోకి అడుగూ పెట్టాను. చక్కగా అందరూ కలిసి కూర్చుని.... సమస్యలకు పరిష్కారమార్గాలుగా అనిపించే పెద్దల అనుభవాలను, పిల్లలకు చెప్పటానికి ఉపయోగపడే ప్రయోజనకర నీతి కథలనూ చెప్పుకుంటూ, వింటూ సరదాగా కాలక్షేపం చేయటం చాలా బావుంటోందని అందరూ అనుకోవటం విని వచ్చాను. ఇక్కడకు వచ్చాక ఆ మాట నిజమేనని పించింది సుమా! మళ్ళీ ఇన్నాళ్ళకు అందరూ వదిలేసిన రచ్చబండ లాంటి కార్యక్రమం అరుగులబడి సమావేశంలా మారి మన వూళ్ళోకి వచ్చినట్లుగా బావుంది. '' అంది పున్నమ్మ.

అక్కడే ఉన్న శ్రీవల్లి చేతుల్ని ఆవిడ ఆప్యాయంగా పట్టుకుంది. ‘‘మీ కుటుంబం మళ్ళీ ఇన్నాళ్ళకి ఈ ఇంటిలో నివాసం ఏర్పరచుకోవటంతో ఈ ఆవరణంతా కళకళ లాడుతోంది! కన్నుల పండుగలా ఉంది! కొందరు ఆడవాళ్ళకు ఉపాధి చూపించటానికి మీరు స్టోర్సును ఏర్పరచటమనేది వూరు వాళ్ళందరకూ ఎంతో సౌకర్యంగా ఉంది...! మీరిలా మంచి పనులు చేయటంతో ఈ ఊరు మరో నందనవనంలా మారిపోతుందనే నమ్మకం కలుగుతోంది...!’’

పున్నమ్మ మాటలకు పులకించినట్లుగా ప్రేమగా చూసింది శ్రీవల్లి ‘‘అవునండీ... మీ లాంటిపెద్దల ఆశీర్వాదం ఉంటే... ఈ ఊరు ప్రజల సహకారంతో... కక్షలు, కార్పణ్యాలూ లేని గ్రామంగా... నందనవనమే అనిపించే విధంగా అభివృద్ధి చెందాలనేదే మా ఆశ, ఆశయం కూడా...!’’ అంటూ వినయంగా బదులు ఇచ్చింది.

పున్నమ్మ రెండడుగులు వేయగానే... పక్కనే కూర్చున్న రాజమ్మ హడావుడిగా ఆవిడ వెంటవచ్చి... ‘‘పున్నమ్మా... ఉండూ ఒక మాట...’’ అంది. ఇద్దరూ ఇంచుమించుగా సమవయస్కులే. చనువూ, స్నేహమూ ఉన్నాయి.

‘‘ఏమిటి రాజమ్మా... నీదేదో నేను ఎత్తుకుపెళ్ళిపోతున్నట్లు... ఇలా వెంటబడ్డావ్... ఏమీ తీసుకుపోవటం లేదు... చూడు...’ అంటూ సరదాగా నవ్వుతూ చీరెకుచ్చిళ్ళు కొంగూ దులిపింది!

రాజమ్మా ‘‘అది కాదులే...’’ అంటూ నవ్వింది

‘‘మరి... దేనికీ... అంత హడావుడిగా వచ్చావు...?’’

‘‘అంటే... ఒక విషయంలో నీ సలహా అడుగుదామనీ... అంతే...’’ అంటూ రాజమ్మ నసిగింది. పున్నమ్మ ఆగి, ఏమిటన్నట్లు చూసింది.

‘‘అదే... మావాడూ తన దగ్గరకు మమ్మల్నిద్దరినీ రమ్మంటున్నాడు. నువ్వు వెళ్ళొచ్చావుగా... నీ మాటల్ని బట్టీ... నేననుకుంటున్నదే సరియైనదీననిపిస్తోంది! బోలెడంత ఖర్చుపెట్టుకుని.... వెళ్ళి రావటం అనవసరం కదూ..?’’ రాజమ్మ మాటలకు ‘‘నీ కలా అనిపించేలా చెప్పానా...’’ అంటూ ఆశ్చర్యంగా చూసింది పున్నమ్మ.

‘‘సరే... నాకు తోచింది మళ్ళీ చెబుతాను... నువ్వే ఆలోచించి నిర్ణయించుకో...! ఖర్చులంటావా... పరిస్థితుల్ని బట్టి నిర్ణయించుకోవాల్సిన విషయం అది. పిల్లలకు ఎపుడూ మన ఆదాయం, ఖర్చులూ అన్నవి తెలియబరుస్తూనే ఉండాలి! అలాగే వాళ్ళ ఆదాయాన్ని బట్టి... అక్కడి ఖర్చుల్ని బట్టీ... వాళ్ళకి ఇబ్బందేమీ ఉండదనిపిస్తే... మీరంత వెనకడుగేయాల్సిన పనీలేదు! అసలు ఇలాంటి విషయాలన్నీ... మనకి మాటల్లోనే అర్థమైపోతూంటాయి! మీ కొడుకూ, కోడలి పిలుపులు మొహమాటానికి వచ్చినవా లేక మనసారా రమ్మంటున్నారా అన్నది తెలియకుండా ఉంటుందా...? దాన్ని బట్టే నిర్ణయమూ ఉంటే... వాళ్ళకీ, మనకీ ఏ ఇబ్బందీ ఉండదు!

మన పిల్లలు ఉద్యోగం చేస్తున్న ప్రదేశం గురించీ, అక్కడివాళ్ళ పద్ధతులూ, కొత్త ప్రాంతపు విశేషాలూ అన్నీ చూసిరావాలనే ఉత్సాహం తల్లిదండ్రులకు ఉంటుంది. అలాగే వాళ్ళ అభివృద్ధిని చూసి మనమూ ఆనందించాలనే ఆశ పిల్లలకూ చాలామందికి ఉంటుందికదా! అయితే... పిల్లలపై మనకి హక్కు ఉందన్నట్లుగా, వాళ్ళపై మన కోర్కెల భారాన్ని మోపాలనుకోవటం మాత్రం నా దృష్టిలో సరికాదు! మన ఊరు నుండి అక్కడికి వెళ్ళొచ్చిన వాళ్ళ మాటల్ని బట్టి ఇంకో విషయమూ చెబుతున్నాను. కొందరు పిల్లలు తమకి ఎంత ఆదాయమున్నా... నలుగురికోసమో ఏమోగానీ... రమ్మంటారు గానీ,

వచ్చిన తల్లిదండ్రుల చిన్న చిన్న కోరికల్నీ, ఇష్టాల్నీ కూడా గమనించనట్లుండి పట్టించుకోరు! అలివి మాలిన ఆశలతో అన్నీ చూసెయ్యాలనే ఆత్రమూ అంతమంచిది కాదు. అలాగే బయటకు అడుగు పెట్టననే వాదమూ సరైనదికాదు. కొత్త దేశానికో, ప్రదేశానికో వెళ్ళిరావటమనేది చాలా ఉత్సాహాన్ని కలిగిస్తుందనేది మాత్రం నిజం! అంతెందుకూ... ఇలా నలుగురం కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ హాయిగా నవ్వుకోవటం... ఎంత ఉల్లాసంగా ఉందీ..? అలాగే, వెళ్ళి పిల్లలతో కాలక్షేపం చేయగలగటమూ ఆనందంగానే ఉంటుంది ! అవునా..?''

రాజమ్మ ఆలోచనలో పడినట్లు ఒక క్షణం మౌనంగా ఉండిపోయింది, ''అవును పున్నమ్మా - నాకూ అలాగే అనిపించింది గానీ... ఈ దేశంలోనివన్నీ చూసేనా ఏమిటీ.. ఎందుకంత హైరానా పడుతూ అంతదూరం వెళ్ళిరావట మూ అని .. అదే వూగిసలాటలా ఉంది...! పైగా ఏ పుణ్యక్షేత్రానికో వెళ్ళొస్తే పుణ్యమైనా దక్కుతుందికదా.!'' అంది రాజమ్మ నిట్టూరుస్తూ.

''గుడి గోపురాల గురించి మాట వచ్చింది కాబట్టి చెబుతున్నా... అబ్బో.. అక్కడా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. పైగా ఎంతో గొప్పగానూ ఉంటాయి తెలుసా? ఇక్కడవన్నీ చూడకపోతే ఏమైందీ.. అక్కడకు వెళ్తే... కొత్త వింత లెన్నో చూడొచ్చును.... మన పిల్లలు ఉండే ప్రదేశం కాబట్టి మనకూ సౌకర్యంగానే ఉంటుంది! లేకపోతే, మనలాంటివాళ్ళం పని గట్టుకుని... డబ్బున్న వాళ్ళల్లా దూరదేశాలకి విహార యాత్రలంటూ బయలుదేరలేం కదా! ఇదిగో, రాజమ్మా... నాకేదో ఎక్కువ తెలిసినట్లు చెప్పటం లేదు. అడిగిన వాళ్ళకు మాత్రం నాకు తోచిన మాటలు నాలుగూ చెప్పటం ఓ అలవాటు! ఎవరమైనా గానీ నలుగురి సలహాలు కాదనకుండా విని, ఆపైన మన కష్టనిష్టూరాన్ని బట్టి ఓ నిర్ణయానికి రాగలగాలి... అవును కదా...?''

పున్నమ్మ మాటలకు చిన్నగా నవ్వి ''మనం వీధిలో నిలబడే ముచ్చట్లు పెట్టేసుకున్నాం, నీకూ తొందర ఉందన్నావుగా....సరే.... ఇక వెళ్ళిరా...!'' అంది రాజమ్మ.

ఇద్దరూ ''మళ్ళీ కలుద్దాంలే'' అని వీడ్కోలు చెప్పుకుని ఎవరిళ్ళకు వాళ్ళు అటుగా బయలుదేరి వెళ్ళారు.

* * *

పున్నమ్మ తన ఇంటి వీధి మలుపులో ఉండగానే కాంతమ్మ ఎదురొచ్చింది.

''అక్కా.... అరుగులబడి వారింటినుండే వస్తున్నావా...?'' అనడిగింది.

''అవునే కాంతం..... ఎప్పటినుండో అనుకుంటే ఈ రోజుకి తీరుబడి అయింది. నా ఉద్దేశ్యం ఏమిటంటే... అందరం ఆ సమయానికి వీలు చేసుకుని ఇలా కలుస్తూంటే మాత్రం చాలా బావుంటుందనిపించింది ! తాపత్రయాలన్నీ మూట కట్టి ఆటకెక్కించేసి... చక్కగా ఇలాంటి ఆటవిడుపు ప్రోగ్రాములు పెట్టుకుని హాయిగా నవ్వుతూ కాసేపయినా కాలక్షేపం చేయగలిగితే.. అంత కన్నా కావల్సిందేమీ ఉండదని ఈ రోజు అర్థమైందనుకో.

నా చిన్నపుడు మా నాన్న 'సుబ్బయ్య శర్మగారి సిద్ధాంతాలు' అంటూ చాలానే చెప్పేవాడు. ఎక్కువ తక్కువల బేధాలు లేకుండా 'ఒక వూరివాళ్ళం.. అందరం ఒక కుటుంబమే' అన్నట్లుగా ఆత్మీయంగా ఉండాలనేది వారి ఆశయమట! ఇప్పుడు మళ్ళీ వారి మనవడు.... ఇన్నేళ్ళ తర్వాత ఆయన ఆశలు, ఆశయాలకూ ప్రాణం పోస్తున్నాడు.... నిజంగా ఇది మన ఊరువాళ్ళ అదృష్టమే! వినగా వినగా మంచి కొంచమైనా తలకెక్కి తీరుతుంది....!''

''అక్కా... నీ మాటలు విన్నా, నాకలాగే ఉంటుంది! చక్కగా చెప్పగలవు, ఈవేళ నువ్వు వస్తున్నావని తెలిసి... నువ్వు చెప్పే అమెరికా సంగతులు విందామని నేనూ వద్దామనుకున్నా. కానీ పిండి వంటల పని పెట్టుకోవటంతో వీలవలేదు. ఇప్పుడు నీమాటలు విన్నాక... అవును.. ఎందుకిలాంటి బరువు బాధ్యతల్ని నెత్తికి ఎత్తుకుని హైరానా పడటం.... మెలమెల్లగా తగ్గించుకోవాలని అనిపిస్తోంది!''

''నిజమే కాంతం ఈ వయసులోనైనా మనం కొన్ని తాపత్రయాల్ని తగ్గించుకోవాల్సిందే! మనకే మంచిది! మనకు నచ్చిన వాటిని అంగీకరించటంలో తాత్సారం పనికిరాదు... తెగింపు చూపాల్సిందే... ఎవరి కోసమో కాదు, మనకి మనమే మంచి చేసుకోవటమన్న మాట! సరే, నా అమెరికా కబుర్లు ఈ రోజు వినకపోతే ఏమయిందిలే, అవేం మురిగిపోయేవికావు, ఆ కబుర్లమూట మనసులో పదిలంగా అలాగే ఉంటుంది! ఇంకొకటీ చెప్పనా...? నేనక్కడ ఉన్నన్నాళ్ళు... ఏ వింత చూసినా, విడ్డూరంగా అనిపించినా, కళ్ళింత చేసుకుని చూసి.... ఫోటో తీసి పటం కట్టేసినట్లుగా మనసులో పెట్టేసుకునేదాన్ని. ఎవరైనా అడిగితే... ఆ దొంతరను కదిపి... కబుర్ల వర్షం కురిపించేద్దామని చూస్తుంటే... అందరూ వెళ్ళొచ్చినవాళ్ళే... ఎవరికీ కొత్తకాదు మరి. ఆ మూట విడివిప్పే అవకాశమే దొరక్కుండా పోతోంది....! నీలాంటి ఒకరిద్దరు ఎవరైనా అడిగితే... ఇంకేముందీ ఆనందంగా తడిసి ముద్దయ్యేలా వాన కురిపించేస్తున్నా చూస్కో, కాస్కో అన్నట్లన్నమాట! మరి ఎపుడొస్తావూ మా ఇంటికీ?... ముందే చెప్పాను కాబట్టి.... ప్రమాదం తప్పిందనుకుంటూ తప్పించుకోవాలనుకుంటున్నావా.... చెప్పు...!'' అంది సరదాగా నవ్వి.

పున్నమ్మ మాటలకు కాంతం కూడా హాయిగా నవ్వింది.

''అక్కా.... నీ మాటల రుచి నాకిపుడే కొత్తగా తెలియటంకాదుగా, ఎప్పటినుండో తెలిసిన విషయమే. అందుకే... నీ హెచ్చరికలకేం నేను బెదిరిపోను! తుపాకీ గుండులా దూసుకు వచ్చేస్తా.... నువ్వే సిద్ధంగా ఉండు...!'' ఏ మాత్రం తగ్గకుండా కాంతం చెప్పింది.

''అదీ చూస్తానుగా'' అంటూ ఆవిడా, ఈవిడా నవ్వుకున్నారు.

* * *

ఆ తర్వాత రెండో రోజుకే ఓ విడ్డూరమైన వార్త... ఆ ఊళ్ళో సంచలనం రేపింది.

భద్రయ్య ఇంటి పక్కన ఉండే మైదానం లాంటి ఖాళీ స్థలంలో ఎవరో తిరుగాడటం చూసిన వాళ్ళు... అచ్చం సుబ్బయ్య లాగే ఉన్నాడని ఒకరూ... 'లాగే ఉండటం ఏమిటీ... సుబ్బయ్యే'.... పక్కనే ఉన్నది రామం అని ఇంకొందరూ నిర్ధారించేశారు.

సరిగ్గా ఆ సమయంలో సుబ్బయ్య గారు ఇంట్లోనే ఉండటం చూశామని ఆరోజే ఆ ఇంటికి సమావేశానికి వచ్చిన వాళ్ళు కొందరు నొక్కి వక్కాణించారు! ఒకే సమయంలో ఒకరే రెండు చోట్లా ఉండటం ఎలా వీలవుతుందీ అని మరికొందరి వాదన! ఎవరికి వాళ్ళు తాము చూసిందే నిజమని నమ్ముతారు కాబట్టి, అదే నిజమని నిరూపించాలని తాపత్రయ పడ్డారు. ఎవరి మాటలు నమ్మాలో తెలియక చాలామంది తికమక పడ్డారు.

సరిగ్గా సమావేశం మధ్యలోనే పరమేశ్వరం గారి కారు వచ్చి ఆగితే రామం కారు దిగి ఇంట్లోకి వెళ్ళగానే, ఆకారు సౌభాగ్యపురం వైపుగా వెళ్ళిపోయిందనీ మరి కొందరు చెప్పారు. అంటే రామం కూడా ఆయనతో కలిసి కనిపించే అవకాశం లేదంటూ అక్కడున్న వాళ్ళు వాదించారు!

సుబ్బయ్య గారయితే, ఆటూ ఇటూ తిరుగుతూ అందరి కబుర్లలోనూ పాలు పంచుకున్నారు, ఆసమయంలో వేరేచోట తిరుగాడటం ఎలా సాధ్యమౌతుందనీ గట్టిగా ప్రశ్నించారు కూడా. దూరం నండి చూసి సబ్బయ్యే అయివుంటాడని భ్రమ పడి ఉంటారని కొందరు అనుకోవటమూ జరిగింది. ఆ సమయంలో ఆయన ఇంట్లోనే ఉండటాన్ని చూసామనే వాళ్ళే ఎక్కువమంది కావడంతో మిగతా వాళ్ళు భ్రమపడ్డారేమోననే ఆలోచనతో మరికొందరు మౌనం వహించాల్సి వచ్చింది.

శ్రీవల్లి వాళ్ళూ వీళ్ళ ద్వారా విన్న ఈ కబురు ఆయనకీ చెప్పింది. ఆయన విని, చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

ఆయనకో విషయం గుర్తుకు వచ్చింది.

ఆరోజు..... అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయిన రెండు నిముషాలకే భద్రయ్యగారి పాలేరు బసవడు చిన్న చీటీ తీసుకు వచ్చి ఇచ్చాడు. 'ఆ రోజు వాళ్ళింటికి వచ్చి, అక్కడ గుమికూడిన వాళ్ళందరితో కలిసి కాలక్షేపం చేయాలనే తన కోరిక కొన్ని కారణాల వలన కుదరలేదు కాబట్టి, మళ్ళీ ఎప్పుడు సమావేశం జరుగుతుందో తెలియ జేయమని' రాసి ఉందా చీటీలో. 'ఆ విషయం ఎవరిని అడిగినా సరిపోతుంది కదా, పనిగట్టుకుని ఆ రాత్రివేళ మనిషిని పంపి సమాచారం తెలుసుకోవాల్సిన తొందర ఏముందీ' అని ఆశ్చర్యం కలిగినా, అపుడు దాని గురించి అంతగా ఆలోచించలేదు... ఏవో రెండు మాటలు కాగితం వెనకే రాసి ఇవ్వటం జరిగింది. ఇపుడు  ఆయనకో విషయం స్పష్టమైంది!

'తన చేను పక్కనే ఆ తిరుగాడిన వాళ్ళద్దరూ దగ్గర్లోనే ఆగి ఉన్న కారు ఎక్కగానే, ఆ కారు పట్నం వైపుగా వెళ్ళిందనీ' ఒకరిద్దరు చెప్పడంతో... ఏ విషయమూ

నిర్ధారించుకోవాలని... అంటే.... 'తను ఇంట్లోనే నిజంగా కొందరు చెప్పినట్లుగా ఉన్నాడా, లేక ఒకరిద్దరు చెప్పినట్లూ ఎక్కడికో వెళ్ళి ఉంటాడా' తెలుసుకోవటానికే పాలేరును చూసి రమ్మంటే బావుండదేమోనని, అలా చీటీ ఇచ్చి పంపివుండొచ్చని అనుకున్నాడాయన.

శ్రీవల్లి కూడా ఆయన ఆలోచన నిజమే అయివుంటుందని అంది.

ఆ తరువాత రెండురోజులకే... రామం యధాప్రకారం ఏదో పని అంటూ బయలుదేరుతున్న వేళ .... నలుగురైదుగురు వస్తాదుల్లాంటి వాళ్ళు నిలబడి ఉండటం చూసి 'ఎవరు కావాలీ, ఏం పనీ' అని వాకబు చేశాడు. వాళ్ళు సరిగా సమాధానం చెప్పకపోవటంతో రామంకి కొంచెం అనుమానం వచ్చి రెట్టించి అడిగాడు.

''మేం సుబ్బయ్య కోసం వచ్చాం. నీకేంటీ జవాబు చెప్పేదీ... అడ్డం లెగు....'' అంటూ నిర్లక్ష్యంగా చూసేసరికి రామానికి కోపం వచ్చిందిగానీ నిగ్రహం చూపించాడు.

''మా ఇంటికి వచ్చి... నీ కెందుకూ అని నన్నే అడుగుతున్నారంటే.... మీరేదో కావాలని గొడవ పెట్టుకోవటానికి వచ్చిన బాపతు మనుష్యుల్లా అనిపిస్తున్నారు! ఆయన కోసం.. మీరు ఏదైనా సలహా, సమాచారం కోసమో వస్తే ఫరవాలేదు గానీ, అనవసరంగా గొడవ పెట్టుకునే ఉద్దేశ్యం ఉంటే మాత్రం కుదరదు.. మీ మంచికోరే చెబుతున్నా. వెనక్కు వెళ్ళిపోండి...'' అన్నాడు.

సినిమాల్లో విలన్లకి మల్లే వాళ్ళు పెద్దగా నవ్వారు. అందులో ఒకడు గొంతు పెంచాడు. ''సుబ్బయ్యా.....బయటకు రా...'' అంటూ గావుకేక పెట్టాడు.

ఆ గలాటా విని ఇంటి బయటకు వచ్చిన సుబ్బయ్యను చూస్తూనే వాళ్ళందరూ రామాన్ని నెట్టుకుని... తడికె తలుపును తీసుకున్నట్లుగా కాకుండా తోసి పడేసి తన్నుకుంటూ లోపలకు వచ్చేశారు.

రామం కూడా వాళ్ళ వెనక వచ్చి అరుగు మీదెక్కి కూచున్నాడు.

''ఎక్కడికో బయలుదేరిన వాడివి .. వెనక్కు వచ్చి కూర్చున్నావేం..?'' ఆయన ప్రశ్నకి రామం చిరునవ్వు చిందించాడు. ''వినోద కార్యక్రమం చూడటం నాకు చాలా ఇష్టమని తెలుసుకదా నాన్నా... ఇక్కడ అలాంటిదేదో జరగ బోతూందనిపించి... ఇలా వచ్చేశాను...!''

రామం మాటలకు ఆయన చిరునవ్వుతో భుజం మీద చేయి వేసి ''ఇక్కడ ఉండి నువ్వు చేయాల్సిందేమీ లేదు గనుక నిశ్చింతగా వెళ్ళి నీపని నువ్వు చూసుకో !'' అన్నాడు.

కొంచెం సందేహంగా చూస్తుండేసరికి ''నేను చెప్పాను కదా...'' అనగానే ఆ మాటలు ఆజ్ఞలా ధ్వనించటంతో రామం వెళ్ళటానికి లేచాడు.

ఒక అడుగు వేసి వాళ్ళతో ''మీ మాటల్లో నాకు మర్యాద కనిపించలేదు. గిల్లికజ్జా పెట్టుకోవాలని మాత్రం అనుకోకండి... నేవెళ్ళిపోతున్నాను, పెద్దాయన ఒకడేకదా, ఏమైనా చేసెయ్యొచ్చని దాడికి తెగబడకండి .. మీ మంచికోరే హితవు చెబుతున్నాను. ఇప్పటివరకూ ఎవరికీ తెలియని సంగతులు మీకు చెప్పనా....? మీ చేయి... ఆయన పిడికిలికి చిక్కిందంటే... కాళ్ళు, చేతుల కీళ్ళన్నీ పట్టు కోల్పోతాయి.. ఇక రెండవది..ఆయన చేతులు చాపి హత్తుకుంటే... అది ధృతరాష్ట్ర కౌగిలే... నుగ్గు నుగ్గు

అయిపోతారు..'' అన్నాడు. ఏదో రహస్యం చెప్పినట్లు గుసగుసలా చెప్పి వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

ఆయన వాళ్ళ వైపు చూస్తూ... ''మీరేదో మాట్లాడదామని వస్తే... మావాడు కొంచెం దూకుడు చూపించాడేమోననిపించింది. అందుకే పంపించేసాను. ఇపుడు చెప్పు తమ్ముడూ... ఏం పని మీద వచ్చారూ..?'' అని ఒకరిని భుజం మీద చేయి వేసి అడిగాడు.

వెనక ఉన్న ఇంకొకడు దురుసుగా ''వరస కలిపి తమ్ముడూ అంటే, మేం మురిసి పోతామనుకున్నావా? 'తమ్ముడూ' అని పిలవటానికి నువ్వు మాకు తోడబుట్టిన వాడివా.... మా వాడలోనివాడివీ కూడా కాదుకదా.....!'' అన్నాడు

''మనం అందరం ఒక వూరివాళ్ళమేగా! ఏదో వరసతో పిలవటమే బావుంటుంది కదా...! అన్న అనో తమ్ముడూ అనో వయసు తేడాను బట్టి పిలుచుకోవటంలో నష్టమేముందీ...?''

ఇంకొకడు చిరాగ్గా చూసి '' మేం వియ్యంకోసం వచ్చిన వాళ్ళం కాదు... కయ్యానికి వచ్చినవాళ్ళం...! అది తెలుసుకో ముందు...!'' గట్టిగా అన్నాడు.

''కయ్యమేదో వస్తుందని ఊహించి నాకు సాయంగా ఉండి పోదామని, వెనక్కి తిరిగి వచ్చిన పోట్లగిత్తలాంటి మావాడి దూకుడుకు ము క్కుతాడు వేసినట్లు... ఇక్కడ ఉండొద్దని ఎందుకు పంపేశాననుకుంటున్నావయ్యా... మీరు కొట్టినా సరే, నేను మీతో పోట్లాట పెట్టుకోవాలనుకోవటం లేదు కాబట్టే కదా!'' అంటూ గట్టిగా అరిచినవాడి వైపు ఆయన అనునయంగా చూశాడు.

ఇంకొకడితో  ''కొట్లాటకైనా, పోట్లాటకైనా ఇద్దరు ఉండాలిగా... మీరంతా ఒకటి అనుకుంటే, ఇంకొకరు ఉండేలా... మరి నా ప్రేమయం లేకుండా మీరు ఎవరిని... ఏం.... చేయగలరు...? చప్పట్లనేవీ ఒక్క చేయితో సాధ్యం కాదని మీకూ తెలుసుగా, మరి కొట్లాట మాత్రం ఎలా  వీలవుతుందీ..?''

ఆయన మాటలు అర్థంకాక వాళ్ళు ఓ క్షణం మొహమొహాలు చేసుకున్నారు.